# రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి







# ఇసుక పాయింట్ల పరిశీలన


AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## ఇంటర్ పరీక్షకు 687మంది గైర్హాజరు

**అక్షరటుడే, ఇందూరు:** ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా సోమవారం మొదటి సంవత్సరం గణితం 1ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 21,473 మంది విద్యార్థులకు గాను.. 20,786 మంది పరీక్షకు హాజరైనట్లు ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. 687 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 58 పరీక్షాల కేంద్రాలు ఉండగా.. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, హైపవర్ కమిటీ, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 56 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఇందులో జిల్లా ఇంటర్ విద్యా అధికారి రవికుమార్ ఆరు కేంద్రాలను పరిశీలించారు.





## కలెక్టరేట్‌లో శ్రీపాదరావు జయంతి

**అక్షరటుడే, ఇందూరు:** శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసన సభ స్పీకర్‌గా శ్రీపాదరావు అందించిన సేవలను గుర్తు చేస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్(ఎల్‌బీ), మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పవన్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.




## రాహుల్‌గాంధీని సన్మానించిన బొబ్బిలి రామకృష్ణ

**అక్షరటుడే, ఇందూరు:** సంఘటన్ శ్రీజన్ అభియాన్‌లో భాగంగా డీసీసీ అధ్యక్షుల శిక్షణ క్యాంప్ సోమవారం ముగిసింది. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం నిజామాబాద్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ రాహుల్‌గాంధీని సన్మానించారు. అనంతరం తన కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోసెషన్‌లో పాల్గొన్నారు.



## నిజామాబాద్ ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్‌గా దిలీప్ కుమార్

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్‌గా (స్థానిక సంస్థలు) దిలీప్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు కలెక్టర్‌గా కొనసాగిన ఐఏఎస్ అధికారి అంకిత్‌కు పదోన్నతి కల్పిస్తూ ఇటీవలే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసిన విషయం విదితమే. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్‌గా నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బాధ్యతలు స్వీకరించిన దిలీప్ కుమార్‌ను పలువురు జిల్లా అధికారులు కలిసి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.




నిజామాబాద్ నగరపాలక సంస్థ ఆస్తి పన్ను వసూలు చేయడంలో వెనుకబడింది. కొంతకాలంగా పన్నులు వసూలు చేసే సిబ్బందికి ఇతర విధులు అప్పగించడంతో వసూళ్లు మందగించాయి. దీని ప్రభావం జనరల్ ఫండ్‌పై పడే అవకాశం కూడా ఉంటుంది. ఖజానాలో ఆశించిన స్థాయిలో డబ్బులు లేకపోవడంతో ఔట్ సోర్సింగ్, కార్మికులు, సిబ్బంది జీత భత్యాలు చెల్లింపులోనూ ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. దీంతో అధికారులు పన్ను వసూళ్లలో వేగం పెంచారు.

- అక్షరటుడే, ఇందూరు

# పన్ను వసూళ్లలో వేగం

- గడువు సమీపిస్తుండడంతో అధికారుల చర్యలు
- ప్రత్యేక బృందాల ఏర్పాటు
- ఎన్నికల నేపథ్యంలో మందగించిన వసూళ్లు

ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరికొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. దీంతో పన్ను వసూలుపై బల్దియా ప్రత్యేక దృష్టి సారించింది. గత రెండు నెలలుగా సర్వేలు, ఎన్నికల కారణంతో సిబ్బందికి ఇతర విధులను అప్పగించారు. సాధారణంగా ప్రతి సంవత్సరం జనవరి, ఫిబ్రవరి నెలలోనే ఎక్కువగా పన్నులు వసూలు అవుతాయి. కానీ ఎన్నికల కారణంతో కాస్త మందగించింది. అయితే ఇటీవల ఎన్నికలు ముగియడంతో మళ్ళీ పన్ను వసూళ్లలో వేగం పెంచారు.

### స్పెషల్ డ్రైవ్‌లు

నిజామాబాద్ మున్సిపల్ అధికారులు గతంలో ప్రతి ఆదివారం ఒక్కో వార్డులో స్పెషల్ డ్రైవ్ చేపట్టి పన్నులు వసూలు చేయడంతో మంచి స్పందన వచ్చింది. కానీ ఈసారి సిబ్బంది సర్వేలు ఇతర బాధ్యతల కారణంగా కొనసాగించలేకపోయారు. బకాయిలు ఎక్కువగా ఉండడంతో ఆశించిన స్థాయిలో వసూలు కాకపోవడంతో అధికారులు ప్రత్యేకంగా బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో ఇద్దరు, ముగ్గురు చొప్పున సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ పన్నులు వసూలు చేస్తున్నారు.

### భారీగా బకాయిలు

నగర పాలక సంస్థలో మొత్తం 85 వేలకు పైగానే అసెస్‌మెంట్లు ఉంటాయి. అనేక వందల వ్యాపార సముదాయాలు ఉన్నాయి. అయితే దీర్ఘకాలిక బకాయిలతో పాటు ప్రభుత్వ ప్రైవేటుపరంగా నగరపాలక సంస్థకు రూ.112 కోట్లు రావాల్సి ఉంది. ఇందులో కొందరు కోర్టుకు వెళ్లడంతో కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటి వరకు రూ.33 కోట్లు వసూలయ్యాయి. ఇంకా సుమారు రూ.70 కోట్లకు పైగా ఆస్తి పన్నులు రావాల్సి ఉంది. అసలే సమయం తక్కువగా ఉండడంతో అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పన్ను వసూళ్ల కోసం తిరుగుతున్నారు. సమయం తక్కువగా ఉండడంతో ఏ మేరకు ఆస్తి పన్ను వసూలవుతుందనేది చూడాల్సి ఉంది.



## సైబర్ నేర బాధితులకు ఉచిత న్యాయ సహాయం: ఎస్పీ

**అక్షరటుడే, కామారెడ్డి:** సైబర్ నేరగాళ్ల భారిన పడి.. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న బాధితుల కోసం ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పరిధిలో సైబర్ నేరాల బారిన పడి ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు తక్షణ న్యాయం అందించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం, జిల్లా న్యాయ విభాగం సంయుక్తంగా కీలక చర్యలు చేపట్టాయి. ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్‌ఆర్ వరప్రసాద్ సైబర్ క్రైం బాధితులకు ఉచిత ప్రభుత్వ న్యాయ సహాయం అందించాలని నిర్ణయించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బు కోల్పోయిన బాధితులు, ఆ నగదును తిరిగి పొందే ప్రక్రియలో భాగంగా సంబంధిత కోర్టులో పిటిషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. అయితే.. ఆర్థికంగా వెనుకబడిన వారు లేదా ప్రైవేట్ న్యాయవాదులను సంప్రదించే స్థోమత లేని బాధితుల కోసం ప్రభుత్వం తరఫున ఉచితంగా 'లీగల్ ఎయిడ్ అడ్వకేట్' సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు.



## పరీక్ష కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ కేంద్రాన్ని స్టేట్ అబ్జర్వర్లు బి.రమేష్, అబ్దుల్ నబీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ విధానం, హాల్ ఏర్పాట్లు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రశ్నాపత్రాల భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణ తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నట్లు పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్ర సిబ్బందికి పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పరిశీలకులకు పరీక్షల నిర్వహణ వివరాలను తెలియజేశారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## హోలీ పండుగకు వైన్స్‌లు బంద్: సీపీ సాయిచైతన్య



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** హోలీ పండుగ నేపథ్యంలో వైన్స్‌లను మూసి ఉంచనున్నట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని వైన్స్ షాపులు బంద్ ఉంచుతున్నట్లు సీపీ తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో సెక్షన్ 20(1) తెలంగాణ ఎక్సైజ్ యాక్ట్ 1968 ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ తెలిపారు. కామదహనం, హోలీ పండుగ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలలో భాగంగా జిల్లాలోని కల్లు దుకాణాలు, కల్లు డిపోలు, ఐఎంఎల్ (ఏ4) షాప్‌లు, బార్లు, క్లబ్బులు ఈనెల 3వ తేదీన సాయంత్రం 6 గంటల నుంచి 5వ తేదీ ఉదయం 6 గంటల వరకు మూసి ఉంటాయని సీపీ తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హోలీ పండుగను ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సీపీ సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాల్లో పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## హనుమాన్ ఆలయం, ధర్మశాల ట్రస్టీ చైర్మన్‌గా నార్ల సురేష్ నియామకం



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని హనుమాన్ ఆలయం, ధర్మశాల నూతన ట్రస్టీ బోర్డును దేవాదాయ శాఖ కమిషనర్ సోమవారం నియమించారు. ట్రస్టీ చైర్మన్‌గా నార్ల సురేష్‌ను ఎంపిక చేశారు. ట్రస్టీలుగా నార్ల సురేష్‌తో పాటు విద్యాసాగర్ షిండే, నార్ల ఉదయ్, శారద, దాసరి శ్రీనివాస్‌లను నియమించారు. నియమితులైన ట్రస్టీలు పదవీ ప్రమాణం, గోప్యతా ప్రమాణం చేసిన తేదీ నుంచి రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా నార్ల సురేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

## ఎంఐఎం మెప్పు కోసమే అరెస్టులు, దాడులు: బండి సంజయ్



**అక్షరటుడే, కామారెడ్డి:** బాన్సువాడ పట్టణంలో ఇటీవల జరిగిన ఘటనలో ఎంఐఎం మెప్పు కోసమే అమాయకులను ప్రభుత్వం అరెస్టులు చేసిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. బాన్సువాడ ఘటనలో అరెస్ట్ అయి జైలులో ఉన్న బాధిత కుటుంబాలను జిల్లా బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన పరామర్శించారు. వారితో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ కార్యకర్తలు తలుచుకుంటే రూ.10 వేల కోట్లు వసూలు చేసి ఢిల్లీకి పంపించవచ్చని, తెలంగాణలో రూ.వెయ్యి కోట్లు పంపించవచ్చని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని తెలిపారు. నేడు రాష్ట్రానికి వచ్చిన రాహుల్ గాంధీ కార్యకర్తలకు డబ్బులు ఎలా వసూలు చేయాలో శిక్షణ ఇచ్చేందుకు వచ్చారా.. ఏ విషయంలో శిక్షణ ఇచ్చేందుకు వచ్చారో చెప్పాలన్నారు. ఎన్నికల్లో ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి హామీలు మరిచారన్నారు. తెలంగాణ ప్రజలపై అభిమానం ఉంటే, ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటే హైడ్రా కూల్చివేతలు, ఖమ్మంలో ఇళ్ల కూల్చివేతలు, రాష్ట్రంలో దాడులకు గురైన దేవాలయాలను రాహుల్ గాంధీ సందర్శిస్తే రేవంత్ రెడ్డి పాలన రాష్ట్రంలో ఏ విధంగా ఉందో ప్రజలు చెప్తారని తెలిపారు. బాన్సువాడ ఘటనలో కిరాణా సామగ్రి కొనుగోలుకు వచ్చిన వ్యక్తిని పార్టీతో సంబంధం లేకున్నా కేవలం వీడియోలో కనిపించారని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారని బండి సంజయ్ మండిపడ్డారు. ఆ వ్యక్తి కుటుంబం ఈరోజు బోరున విలపిస్తుందని పేర్కొన్నారు. హోంశాఖ, విద్యాశాఖ సీఎం దగ్గరే ఉన్నాయని, ఆ శాఖల్లో ఏం జరుగుతుందో సీఎంకు సమాచారం రావడం లేదా..? వచ్చినా పట్టించుకోవడం లేదా అని ప్రశ్నించారు. జీహెచ్‌ఎంసీలో ప్రభుత్వం సర్వే చేయించుకుందని, కూల్చివేతలు, దాడుల పట్ల ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, బీజేపీకి సానుకూలత ఉందని తేలిందన్నారు. దాంతో ఇప్పట్లో జీహెచ్‌ఎంసీ ఎన్నికలు పెట్టకుండా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లే యోచనలో ఉందన్నారు. బాన్సువాడలో జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపకుండా, వాస్తవాలు గ్రహించకుండా పోలీసు యంత్రాంగం చట్టపరమైన చర్యలు తీసుకోలేదని సంజయ్ ఆరోపించారు. ఎంఐఎం, ఒవైసీ బ్రదర్స్ మెప్పు కోసం 17 మందిని ప్రభుత్వం అరెస్ట్ చేసిందని, పోలీసుల భయంతో 1015 మంది పారిపోయారన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.




జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్‌లో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో కామ దహనం



ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

# భక్తిశ్రద్ధలతో కామదహనం..

**కామదహనం వేడుకను ఉమ్మడి జిల్లాలో సోమవారం ఘనంగా నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించే ఈ ఘట్టం తర్వాత రోజు హోలీ జరుపుకోనున్నారు. నగరంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కామదహన కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాంధీచౌక్‌లో ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.** – అక్షరటుడే, ఇందూరు



# రంగు మారింది..
# ప్రకృతి దూరమైంది

ఒకప్పుడు హోలీ అంటే హంగామా.. హుషారు వేరుగా ఉండేది.. వారం రోజుల ముందు నుంచే ఇంటింటా కోలాటాలు, యువత సందడి చేసేవారు. అయితే ప్రస్తుతం రోజులు మారి పోయాయి. హోలీ ఒక్కరోజుకు పరిమితమైంది. ఆ రోజు కూడా డీజే పాటలు, కృత్రిమ రంగులతో పండుగ చేసుకుంటున్నారు. సంప్రదాయాలను పట్టించుకోవడం లేదు. మంగళవారం హోలీ సందర్భంగా 'అక్షరటుడే' ప్రత్యేక కథనం..

– అక్షరటుడే, కామారెడ్డి



- పెరుగుతున్న పట్టణీకరణ.. అంతరిస్తున్న మోదుగ చెట్లు
- నాటి తీపి జ్ఞాపకాలు నెమరువేసుకుంటున్న పల్లె జనం

హోలీ అంటే చిన్నా పెద్ద తేడా లేకుండా ఎంతో ఎంజాయ్ చేస్తారు. ముఖ్యంగా చిన్నారులు, యువత రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడుపుతారు. అయితే గతంలో రంగుల పండుగ వచ్చిందంటే ఊరంతా సందడి ఉండేది. కానీ ప్రస్తుతం రోజులు మారాయి. ఎవరికి వారు కాలనీలు, కొంత మంది స్నేహితులు రంగులు చల్లుకుంటున్నారు. ఫొటోలు దిగి స్టేటస్‌లు పెట్టుకున్నారు. మారుతున్న కాలానికి తోడు, వేగంగా పెరుగుతున్న యాంత్రీకరణ, పట్టణీకరణ పండుగ స్వరూపాన్నే మార్చేశాయి. ఒకప్పుడు ప్రకృతి ఒడిలో సహజంగా జరుపుకునే హోలీ, నేడు కేవలం రసాయనాల రంగులు, డిజిటల్ తెరల ప్రదర్శనగా మిగిలిపోయింది.

### అంతరిస్తున్న మోదుగ చెట్లు

గతంలో ఎక్కడ చూసిన మోదుగ చెట్లు కనిపించేవి. బీడు భూములు, చెరువు కట్టలు, అడవుల్లో మోదుగ చెట్లు ఉండేవి. హోలీకి ముందు ప్రజలు మోదుగ పూలను సేకరించి ఉడకబెట్టి రంగులు తయారు చేసుకునేవారు. కానీ ప్రస్తుతం మోదుగ చెట్లు తగ్గిపోయాయి. బీడు భూములు కాస్తా వెంచర్లుగా మారిపోతున్నాయి. దీని ప్రభావం పర్యావరణంపై తీవ్రంగా పడుతోంది. హోలీకి ప్రధాన ఆకర్షణ అయిన సహజ సిద్ధమైన మోదుగ చెట్లు నేడు ఊరి పొలిమేరల్లో కూడా కనిపించడం లేదు. దీంతో ప్రజలు కృత్రిమ రంగులతో హోలీ చేసుకుంటున్నారు. వీటితో చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. సహజ సిద్ధంగా లభించే రంగులను వాడాలని సూచిస్తున్నారు.

### కనుమరుగవుతున్న కోలాటాలు

ఒకప్పుడు హోలీ వచ్చిందంటే కోలాటం దరువులతో పల్లె వీధులు మార్మోగేవి. పదిమంది మహిళలు ఒక గ్రూపుగా ఏర్పడి, లయబద్ధమైన జానపద బాణీలతో పాడుతూ, అందర్నీ ఆటపట్టిస్తూ ఉండేవారు. ఆ పాటల్లో పల్లెటూరి స్వచ్ఛత, ఆత్మీయత ఉట్టిపడేది. కానీ నేడు ఆ సమష్టి సంబరం మాయమైంది. నేడు డీజేల మోతలో పడతుల వసంత గానాలు మూగబోయాయి. జానపద కళల స్థానాన్ని ఆధునిక ధోరణులు ఆక్రమించాయి.

### వరుసల కలయిక... హోలీ వేడుక

నాడు హోలీ అంటే వయసుతో నిమిత్తం లేని వేడుక. మనవడు తాతకు రంగులు పూసేవాడు. బావమరదళ్ల సరసాలు, అక్కాతమ్ముళ్ల అల్లరితో వాడలన్నీ కిటకిటలాడేవి. ఆత్మీయ కౌగిలింతలు మనుషుల మధ్య ఉన్న ఏవైనా భేదాలను తుడిచిపెట్టే సేవి. కానీ నేడు అంతా యాంత్రికమైపోయింది. నేటి మనుషులు బీజీ జీవితంలో పడి పక్కన ఉన్న వారిని కూడా పట్టించుకోవడం లేదు.

### వాట్సాప్ స్టేటస్‌లకే పరిమితం

అప్పట్లో పక్కవాడి ఇంటికి వెళ్లి రంగులు పూయడం పండుగ. నేడు హోలీ అంటే కేవలం వాట్సాప్‌లో శుభాకాంక్షలు చెప్పడం, స్టేటస్‌లు పెట్టుకొని సరిపెడుతున్నారు రసాయన రంగులు పూసుకున్న పది నిమిషాలకే సెల్ఫీ దిగి, సోషల్ మీడియాలో పోస్ట్ చేయడానికే నేటి తరం ప్రాధాన్యత ఇస్తోంది. అసలు ఈ పండుగను సహజంగా జరుపుకుంటున్నామా లేక కేవలం ప్రదర్శన కోసమే చేస్తున్నామా? అనే సందేహం కలుగుతోంది. యాంత్రీకరణ మనిషి జీవితాన్ని సులభం చేసి ఉండవచ్చు కానీ రోజురోజుకూ మనసుల మధ్య దూరాన్ని పెంచుతోందనేది నిజం. పట్టణీకరణ పేరుతో ప్రకృతిని నాశనం చేయడం వల్ల మనం మన మూలాలను కోల్పోతున్నాం. మళ్లీ ఆ నాటి పచ్చని పల్లె హోలీని చూసుకోవాలంటే, పర్యావరణాన్ని కాపాడుకుంటూనే ఆత్మీయతతో కూడిన పాత సంప్రదాయాలను పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## తాడ్వాయి ఎంపీడీవోగా రాజేశ్వర్

**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో రాజేశ్వర్ తాడ్వాయి ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రానికి నూతన ఎంపీడీవోగా ఎల్లారెడ్డి నుండి తహేరా బేగం రానున్నట్లు తెలిసింది.

## ఇసుక పాయింట్లను పరిశీలించిన అధికారులు



**అక్షరటుడే,కోటగిరి :** ప్రభుత్వ ఇసుక పాయింట్లను అధికారులు సోమవారం పరిశీలించారు. పోతంగల్ మండలంలోని హంగర్గా, కారేగాం, సుంకిని, ప్రభుత్వ ఇసుక పాయింట్లలో కాలపరిమితి ముగియడంతో రెన్యువల్ చేసేందుకు పరిశీలన చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ గంగాధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధన్‌రాజ్, ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ రెడ్డి, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారి హరీష్, సర్వేయర్ పోశెట్టి, నిజామాబాద్ టీజీఎండీసీ, మైనింగ్ డిపార్ట్‌మెంట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూర్‌లో సివిల్ రైట్స్‌పై అవగాహన




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో సివిల్ రైట్స్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై భార్గవ్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో సమానత్వ హక్కు, స్వేచ్ఛహక్కు దోపిడీ వ్యతిరేక హక్కు, మత స్వేచ్ఛ హక్కులపై గ్రామస్థులకు వివరించారు. ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకొని, వాటిని చట్టబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఇతరుల హక్కులను గౌరవించాలని రెవెన్యూ అధికారులు తెలిపారు.

## గ్రామంలో నీటిఎద్దడి లేకుండా చూడాలి




**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో సోమవారం సర్పంచ్ అట్టెం శ్రీను అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. గ్రామంలోని ప్రతి అధికారి గ్రామ అభివృద్ధికి పాటుపడాలని తీర్మానం చేశారు. విద్యుత్ దీపాల నియంత్రణ, మురికి కాల్వల పూడిక తొలగింపుపై చర్చించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలయ్య, పాలకవర్గ సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## జిల్లా తెలంగాణ ఉద్యమకారుల నూతన కమిటీ ఎన్నిక



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా తెలంగాణ ఉద్యమకారుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. కమిటీకి చైర్మన్‌గా పుప్పాల రవి, అధ్యక్షుడిగా శ్రీనివాస్ గౌడ్, కన్వీనర్‌గా పులి జైపాల్, ప్రధాన కార్యదర్శిగా సల్లా ప్రవీణ్, అధికార ప్రతినిధిగా గొల్లపల్లి రాజుగౌడ్ నియమితులయ్యారు. అలాగే కో-కన్వీనర్లుగా సాయిరాం యాదవ్, అబ్బి ప్రగతి కుమార్, బరికుంట శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులుగా భవానీపేట్ శ్రీనివాస్, నవాతే ప్రతాప్, లాల్ సింగ్, అనుపాల్ కిరణ్, యూసుఫ్, రంజిత్ కుమార్, కార్యదర్శులుగా రంగు సీతారాం, మైత్రి రాజశేఖర్, జ్వాల రాణి, సౌందర్య, సిద్ధలక్ష్మి, సజ్జనం భానుచందర్‌లను ఎన్నుకున్నారు. అలాగే సలహాదారులుగా జమాల్‌పూర్ గణేష్, నరసింహా చారి, దాదన్న గారి విఠల్ రావు, గైని గంగారం, ఆశ నారాయణ, రాజారెడ్డిలను ఎన్నుకున్నారు.



## ప్రభుత్వ భూమి కాపాడాలని గ్రామస్థుల వినతి

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్థులు సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని నాగులూర్ వార్సల చేను ప్రదేశంలో గంగవ్వ ఇంటిపట్టా ఉంది. అయితే ఆ స్థలానికి పక్కనే ఉన్న పశువులు నీళ్లు తాగే కుండీ, దోభిఘాట్‌ను ధ్వంసం చేసి ఓ వ్యక్తి కబ్జా చేశాడని వారు ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే విచారణ చేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు. పాలకవర్గం స్పందించకపోతే గ్రామ సభలో తీర్మానం చేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని బీజేపీ మండల వైస్ ప్రెసిడెంట్ జాదవ్ రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి హత్య కేసులో అన్నదమ్ములకు జీవిత ఖైదు

**అక్షరటుడే, కామారెడ్డి:** స్నేహితుడిపై హత్య కేసులో ఇద్దరు నిందితులకు కామారెడ్డి కోర్టు జీవితఖైదు విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించింది. పాల్వంచ మండలం ఆరేపల్లికి చెందిన నవీన్ కుమార్, భువనగిరి మధు ఇద్దరు స్నేహితులు. అయితే నవీన్ ప్రవర్తన మధు కుటుంబ సభ్యులకు ఇబ్బందికరంగా మారింది. కుటుంబ గౌరవం పోతుందని పద్ధతి మార్చుకోవాలని నవీన్‌కు మధు పలుమార్లు సూచించాడు. అయినా మారకపోవడంతో నవీన్‌ను అడ్డు తొలగించుకోవాలని భావించిన మధు తన అన్న ప్రభాకర్‌తో కలిసి హత్యకు పథకం పన్నాడు. 2024 మార్చి 26న నవీన్ తన భార్యను పొలం వద్ద వదిలి ఆటోలో తిరిగి వస్తుండగా రామేశ్వర్ పల్లి శివారులో ఓ పొలం వద్ద అన్నదమ్ములు అడ్డగించి నవీన్‌ను పొలంలోకి లాక్కెళ్లి కూరగాయల కత్తితో విచక్షణారహితంగా దాడి చేశారు. దాడిలో నవీన్ అక్కడికక్కడే మృతి చెందగా మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కోర్టులో ప్రవేశపెట్టారు. జిల్లా జడ్జి ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి



**అక్షరటుడే, ఇందూరు:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కేర్ కళాశాలలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా బకాయిలు పేరుకుపోవడంతో కళాశాలల మనుగడ కష్టంగా మారిందన్నారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా కళాశాలను కొనసాగిస్తున్న తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. గత కొన్ని నెలలుగా తమ కళాశాలల ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. బకాయిలు చెల్లించకపోతే కళాశాలలు మూతపడడం ఖాయమని, ప్రైవేట్ కళాశాలల్లో పనిచేస్తున్న వేలాదిమంది జీవితాలు రోడ్డుమీదికి వస్తాయని జైపాల్‌రెడ్డి అన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి నరాల సుధాకర్, శ్రీనివాసరాజు, సూర్యప్రకాష్, నవీన్, సుజన్ రెడ్డి, అనిల్, హకీం, రాజేశ్వర్, సంజీవ్, దత్తు, కిషన్ రెడ్డి, దేవారెడ్డి, రాజేందర్, హరి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వ సలహాదారు సత్యంగౌడ్‌ను సన్మానించిన కోటపాటి



**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహనాయుడు యూఏఈ పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా యూఏఈలోని షార్జా సిటీలో జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ గ్రామానికి చెందిన సత్యం గౌడ్‌ను కలిసి సత్కరించారు. సత్యం గౌడ్ తెలంగాణ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమ సలహా మండలి సభ్యుడిగా నియమితులైన సందర్భంగా మర్యాదపూర్వకంగా కోటపాటి కలిసి సన్మానించారు. ఆయన వెంట ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక దుబాయ్ కో-ఆర్డినేటర్ జంగం బాలకిషన్ ఉన్నారు.





## ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఫేర్‌వెల్ పార్టీ..

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పట్టణ శివారులోని గాంధీ నగర్‌లో ఉన్న ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన విద్య విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందన్నారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించేందుకు విద్య ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసం పెంపొందించుకొని పరీక్షల పట్ల భయాన్ని తొలగించాలని జీవితంలో అన్ని సవాళ్లను ధైర్యంతో ఎదుర్కోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల పరిపాలన అధికారి పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.